క్లుప్తంగా

నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ

నకరికల్లు : ఈనెల 15వతేదీ నుంచి 18వతేదీ వరకు డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా పథకం కొత్త రిజిస్ట్రేషన్లపై అభ్యంతరాల స్వీకరణ చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు ఆదివారం తెలిపారు. రైతు భరోసాకేంద్రాల వారీగా అర్హుల, అనర్హుల జాబితాను ప్రదర్శించామన్నారు. గతేడాది లబ్ధిపొంది ప్రస్తుతం మరణించి ఉంటే వారి భర్త గాని, భార్యగాని నామినీగా నమోదు చేసుకోవచ్చన్నారు. దీనికోసం భూమిప త్రాలు, ఆధార్‌కార్డు, ఇతరపత్రాలను ఆయా గ్రామాల గ్రామ వ్యవసాయ సహాయకులకు అందజేయాలన్నారు. అర్హుల, అనర్హుల జాబితాపై సందేహాలుంటే వీఏఏలకు తెలియజేస్తే డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసాపోర్టల్‌లో పొందుపరుస్తారని తెలిపారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

పెదకూరపాడు: గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం ఏంతో అభినందనీయమని పారిశ్రామిక వేత్త సామినేని కోటేశ్వరరావు అన్నారు. పెదకూరపాడులోని ఆర్‌సీయం పాఠశాలలో ఆదివారం కొమరాబత్తిన రోజమ్మ, కార్యంశెట్టి జయరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు యూనియన్ బ్యాంక్ విశ్రాంతి జనరల్ మేనేజర్ డాక్టర్ కేవీఎల్ రాజు, శంకర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజు మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శిబిరంలో మొత్తం 450 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 229 మందికి కంటి శుక్లాల ఉన్నట్లు నిర్ధారించారు.

ఉపాధిహామీలో మేట్ల వ్యవస్థను కొనసాగించాలి

మాదల(ముప్పాళ్ళ): ఉపాధిహామీ పథకంలో మేట్ల వ్యవస్థను కొనసాగించాలని వ్యవసాయ కార్మికసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి అనుములవెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాని కోరారు. మండలంలోని మాదల గ్రామంలో ఉపాధిహామీ పథకం పనులు జరిగే ప్రాంతాన్ని ఆదివారం సందర్శించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉపాధిహామీ పథకాన్ని బలహీనపరచడానికి కుట్రలు చేస్తున్నారని, అందులో భాగంగానే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్ఎంఎంఎస్‌యాప్) తీసుకువచ్చారని విమర్శించారు. ఈ వ్యవస్థ ద్వారా మేట్ల వ్యవస్థ నిర్వీర్యం అవుతుందన్నారు. బడ్జెట్‌లోను ఉపాధిహామీ పథకానికి కేటాయింపులు భారీగా కోతలు విధించారని, దేశంలోని కూలీలందరికీ వందరోజులు హక్కు అమలు చేయాలంటే కనీసం మూడులక్షల కోట్లు రూపాయలు బడ్జెట్ కావాల్సి ఉండగా కేవలం 70వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారన్నారు. ఉపాధిహామీ పథకం అమలుపై నియంత్రణ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు ఇవ్వాలన్నారు. నేషనల్‌మానిటరింగ్ సిస్టం యాప్‌ను రద్దు చేసి పాతపద్ధతుల్లోనే ఉపాధిపనులు చేయించాలని, మేట్ల వ్యవస్థను పునరుద్దరించాలని, సమ్మర్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద వ్యవసాయకార్మికసంఘం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మాదల గ్రామ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్‌సైదాఖాన్, కంచర్లనాగేశ్వరరావు, జాలయ్య, నాగమల్లేశ్వరరావు, కె.సాంబశివరావు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్సీ అగ్రికల్చరల్ విద్యార్థికి స్నేహహస్తాలు వితరణ



అచ్చంపేట: మండలంలోని తాడువాయిగ్రామానికి చెందిన సలికేటి అంజలి తన ప్రతిభతో ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్శిటీలో ఎమ్మెస్సీలో ఫ్రీసీటు సాధించగా, కళాశాల ఫీజు నిమిత్తం స్నేహహస్తాలు ఫౌండేషన్ తరఫున ప్రముఖ వైద్యులు యం.మధుసూదనరావు సీతీమణి విజయలక్ష్మీ చేతులమీదుగా ఆదివారం రూ.25వేల చెక్కును అందజేశారు.
ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి తాయి కరిముల్లాబాబు మాట్లాడుతూ బీద కుటుంబానికి చెందిన అంజలి తెలివైన విద్యార్థి అని అమె బీఎస్సీలో కూడా తామే కళాశాల ఫీజు రూ.లక్ష వరకు చెల్లించామని చెప్పారు. ఆమె తన ప్రతిభతో ఎమ్మెస్సీ ఫ్రీసీటు సాధించడంతో ఆమె చదువుకు అవసరమయ్యే కాలేజీ ఫీజు నాలుగు సెమిష్టర్స్‌కి, సెమిష్టర్‌కి రూ.25వేలు చొప్పున లక్ష రూపాయలు చెల్లిస్తామని చెప్పారు. హాస్టల్ ఫీజు జగనన్న వసతి దీవెన ద్వారా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో చెరుకుంపాలెం రూరల్ డవలప్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు తుమ్మా శౌరెడ్డి, విద్యార్థి తండ్రి సలికేటి సింహరాయలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల పరిధిలో భూసార పరీక్షలు

- సత్తెనపల్లి డివిజన్‌లో 133 రైతు భరోసా కేంద్రాలు
- ఆరు మండలాల్లో 211 మట్టి నమూనాలు

సత్తెనపల్లి: భూమి సార వంతంగా ఉంటేనే దిగుబడులు మెరుగవుతాయి. గత కొన్నేళ్లుగా రైతులు రసాయనాలు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూసారం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా సాగులో ఎరువుల వినియోగానికి అత్యధిక ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల పరిధిలో మట్టి నమూనాలు సేకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రతి రైతుభరోసా కేంద్రం పరిధిలో మట్టి నమూనాలు సేకరించాలని సిబ్బందికి సూచనలు చేసింది. ఇప్పటికే మండలాల వారీగా వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు మండల స్థాయిలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించి మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నేలలో ఉదజని సూచిక, ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం నిష్పత్తులు వెల్లడవుతాయని చెబుతున్నారు. తద్వారా పొలానికి ఏయే ఎరువులు ఎంత మోతాదులో వినియోగించాలో తెలుసు కోవచ్చు. తద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. సూక్ష్మ ధాతుల లోపాలను సవరించుకుని సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చు. నమూనాలకు సేకరించే మట్టిలో రాళ్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చేసుకోవాలి. రైతు వివరాలు, పంట తదితర వివరాలను పొందుపరచాలి. అప్పుడే ఆ మట్టిని ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తారు.



కందులవారిపాలెంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సత్తెనపల్లి డివిజన్‌లో ఆర్బీకేలు, మట్టి నమూనాలు ఇలా...

మండలం	ఆర్బీకేల సంఖ్య	మట్టి నమూనాలు
సత్తెనపల్లి	20	60
ముప్పాళ్ళ	13	26
రాజుపాలెం	14	29
నకరికల్లు	14	-
పెదకూరపాడు	14	-
అచ్చంపేట	17	50
అమరావతి	16	-
క్రోసూరు	15	26
బెల్లంకొండ	10	20
మొత్తం	133	211

ఫలితాలతో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చు



రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు. వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏకు ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించాం. ఆర్‌బీకే సిబ్బంది ఇప్పటికే వారికి కేటాయించిన నమూనాలు సేకరించారు.

–ఎస్.శ్రీధర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకుడు, సత్తెనపల్లి

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



పట్టణంలోని మహరాష్ట్ర వీధిలో ప్రత్యేక అలంకరణలో శ్రీ భక్త ఆంజనేయ స్వామి



పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని ప్రారంభించి బైక్ నడుపుతున్న మంత్రి అంబటి



ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సత్తెనపల్లి: హనుమజయంతి వేడుకలు ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని అన్ని ఆంజనేయ స్వామి దేవాలయాలల్లో, రామాలయాలల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్త హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నారాయణ సేన నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల వద్ద నుండి హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ ప్రారంభ మైంది. ఈ ర్యాలీ కార్యక్రమాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామభక్తుడు, అశేష బల వంతుడు అయిన ఆంజనేయ స్వామి ఆశీస్సులు మనందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ముందుగా ర్యాలీని ప్రారంభించిన ఆయన ద్విచక్రవాహనం నడుపు కుంటూ వందలాది మంది భక్తులు తమ ద్విచక్ర వాహనాలతో హనుమాన్ ర్యాలీలో పాల్గొన్నారు. మంత్రి అంబటి రాంబాబు తో పాటు పట్టణ ప్రజా ప్రతినిధులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణంలోని మహారాష్ట్ర వీధి నందు శ్రీ భక్త ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో ఆదివారం ఉదయం నుంచి అంగ రంగ వైభవంగా శ్రీ హనుమత్ జయంతి ఉత్స వాలను నిర్వహించారు. 108 మంది మహిళలతో ఆంజనేయ స్వామికి సామూహిక కుంకుమార్చన, సింధూర అర్చన నిర్వహించారు. మంత్రితో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్టా సాంబయ్య, స్థానిక ప్రజా ప్రతి నిధులు, వైఎస్సార్ సీపీ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.

బెల్లంకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతిని భక్తులు వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, చంద్రాజుపాలెం, పాపాయపాలెం, కందిపాడు, నాగిరెడ్డిపాలెం, గ్రామాల్లో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి పొంగళ్లు చేసి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో కల్యాణ వేడుకలు ప్రారంభించారు.

వైభవంగా ప్రసన్నాంజనేయుని కల్యాణం...

బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరి ప్రసన్నాంజనేయ స్వామి వారి కల్యాణ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజు పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం నుంచి అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం విశ్వక్షేన పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం రామ నామ సంకీర్తన తదితర పూజా కార్యాక్రమాలను ఆలయ అర్చకులు నరసింహాచార్యులు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులతో కలసి ప్రారంభించారు.

మంత్రి అంబటి ప్రత్యేక పూజలు...

స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఉత్సవాల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొన్నారు. ముందుగా దేవాదాయ శాఖ అధికారులు, పార్టీ నాయకులు మంత్రి అంబటికి ఘనంగా పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, బెల్లంకొండ ఎంపీపీ చన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వర రెడ్డి, దేవాలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి, రాజుపాలెం జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత, శ్రీనివాసరెడ్డి, దేవాదాయ శాఖ ఈఓ గాదె రామకోటిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు కొండెబోయిన శ్రీనివాసరాజు, ప్రత్తి శ్రీనివాసరావు, పెండ్యాల మల్లయ్య, నారుమళ్ల రామకోటి, ఆరుద్ర సాంబశివరావు, మెరుగు మంగమ్మ, పాలవాయి ఆదినారాయణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదకూరపాడులోని హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు.

క్రోసూరు: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆంజేయస్వామి దేవస్థానాల్లో భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గుడిపాడు గ్రామంలో అభయాంజనేస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పాతూరి రామకృష్ణరావు, పాతూరి శంకరరావు, కాంతారావు, కాశియ్య, షేక్ నాగూర్, బుడే, మహేశ్వరరావు, పాతూరి సునీత, చెన్నకేశరమ్మ, వసంతకుమారి తదిరులు పాల్గొన్నారు. క్రోసూరు సిద్ధిపాలెంలో ప్రసన్నాంజనేయస్వామి తొమ్మిదవ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. గొప్ప అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: స్థానిక నాలుగురోడ్ల కూడలిలోని అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమత్ జయంతి ఆదివారం వైభవంగా జరిగాయి. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ఇష్టమైన ఆకుపూజలు, సింధూర పూజలు చేశారు. నూతికట్టు శంకర్‌గుప్తా ఆధ్వర్యంలో హనుమాన్‌చాలీసా పఠించారు. స్థానిక వాగొడ్డునగల శ్రీ షిరిడీసాయిబాబు దేవాలయం ముందుగల పంచముఖ వీరాంజనేయస్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకు పూజలు అభిషేకాలు చేశారు. శాంతి హోమాలు నిర్వహించారు. శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారికి కల్యాణం చేశారు.

అమరావతి: హనుమత్ జయంతి సందర్భంగా ఆదివారం మండలంలోని గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం చేసి ఆకుపూజలు, వడమాలలు స్వామివారికి సమర్పించుకున్నారు. పుణ్యక్షేత్రమైన అమరావతి పవిత్ర కృష్ణానదీ తీరాన అభయాంజనేయస్వామి ఆలయంలో, మెయిన్‌రోడ్‌లోని కోదండరామాలయంలోని అభయాంజనేయునికి వేకువజామున పంచామృతసప్పన నిర్వహించి విశేషాలంకారం చేశారు. కోదండ రామాలయంలో పరాశరం రామకృష్ణ మాచార్యులు ఆధ్వర్యంలో గత నలభైరోజులుగా వాసవీ మహిళా మండలి సభ్యులు హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మండల దీక్షతో నిర్వహించే ఈపారాయణం హనుమత్ జయంతి సందర్భంగా 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేసి ముగించారు . మల్లాది గ్రామంలో వేంచేసిన ధ్యానాంజనేయునికి హనుమత్‌జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5వేల మంది భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. లేమల్లె అంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు బందంరావూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. అనంతరం అన్నదానకార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముప్పాళ్ళలో

ముప్పాళ్ళ: మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దమ్మాలపాడు, గోళ్ళపాడు, ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లో ఉన్నటువంటి శ్రీఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

అ'పూర్వ' కలయిక



ఆనాటి ఉపాధ్యాయులో కలిసి పూర్వ విద్యార్థులు

తుమ్మకోట(రెంటచింతల): ఎక్కడెక్కడో పుట్టి అంతా ఒక్క చోటికి చేరి విద్యాభ్యాసంచేసిన విద్యార్థులు తిరిగి 20 ఏళ్లకు మళ్లి అంతా కలిశారు. గుర్తుపట్టని ఆకారాలతో ఒకరిని ఒకరు పరిచయం చేసుకుంటూ ఆనాటి తీపిగుర్తులను నెమరవేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 బ్యాచ్ 10వతరగతి చదివినవారు ఆదివారం పాఠశాలలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పోట్ల రామకృష్ణ అధ్యక్షతన సిల్వర్ జూబ్లీ ఆత్మీయసమ్మేళన వేడుకలను నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటు పాఠశాల ఆవరణమంతా కలియతిరిగారు. క్రీడామైదానంలో వివిధ రకాల ఆటలను ఆడారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. వారు కుర్చున్న తరగతి గదుల్లో మరోసారి కుర్చుని ఆనాటి ఉపాధ్యాయులు బోధిస్తున్నప్పుడు ఎలా శ్రద్దగా విన్నారో మననం చేసుకున్నారు. గుదే వెంకటేశ్వర్లు, చదలవాడ కృష్ణవేణి, నవులూరి శ్రీనివాసరావు, శివలక్ష్మి, పోట్ల సంధ్యారాణి, దిర్శినాల వెంకటేశ్వర్లు తదితర పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులంతా తమ నుతాము వేదికపై పరిచయం చేసుకుని తమకు పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని గర్తు చేసుకున్నారు. జెడ్పీ పాఠశాలలో చదువుకుని పూర్వ విద్యార్థుల వేడుకలను నిర్వహించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఆనాటి ఉపాధ్యాయులను, ప్రస్తుతం విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను దుశ్శాలవలతో, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం కాసు శౌరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పోట్ల రామకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దేశీయ ఆవుల్లో రోగనిరోధకశక్తి ఎక్కువ

నాబార్డుమాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు



దేశీయ ఆవులను పరిశీలిస్తున్న నాబార్డు మాజీ చైర్మన్ గోవిందరాజులు

అమరావతి: భారతదేశ పశుగణాభివృద్ధి గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో దేశీయ ఆవుల అభివృద్ధి కేంద్రం ప్రారంభించడం అభినంనీయమని నాబార్డు మాజీ చైర్మన్ చింతల గోవిందరాజులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అత్తలూరులో అత్తలూరు పాలెం ఆర్గానిక్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ఎం.డి నూతలపాటి సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన దేశీయ ఆవుల అభివృద్ధికేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ రాభోయేతరాలకు జీవం ఉన్న భూమిని మనం వారసత్వంగా అందించాలంటే ఎరువులు, పురుగు మందులు వాడకుండా పశువుల ఎరువులను వాడాల్సిన అవసరం ఉందన్నారు. భూమిలో రసాయన సమతుల్యత సాధించాలంటే పశువుల వృద్ధి జరగాలన్నారు. దేశీయ ఆవుల్లో రోగనిరోధకశక్తి అధికంగా ఉండి అవులు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. అలాగే వీటి ద్వారా తయారు చేసే ఘనజీవామృతం, గోఆధా రిత ఉత్పత్తుల తయారీ మరింతగా అభివృద్ధి చెందాలన్నారు. తొలుత దేశీయ ఆవుల అభివృద్ధి కేంద్రాన్ని, తెలంగాణ నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సుశీలతో నాబార్డు మాజీ చైర్మన్ గోవిందరాజులు ప్రాంభించారు. అనంతరంం దేశీయ ఆవుల గురించి అక్కడి రైతులతో మాట్లాడి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చైతన్యగో దావరి బ్యాంక్ చైర్మన్ కామేశ్వ రరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు నూతలపాటి హనుమయ్యలతో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ వెంపా జ్వాలాలక్ష్మీ నరసింహారావు, కోట హరిబాబు, సతీష్, నరసయ్యలతో పాటు రైతులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం



తొండపిలోని శివాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ట మహోత్సవం

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో శ్రీభీమేశ్వర వీరభద్రేశ్వర స్వామివార్ల బింబియంత్ర శిఖర ధ్వజ పునఃప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నూతనంగా నిర్మించిన ఆలయంలో అద్దంకమ్మతల్లి (పోతురాజుసమేత), గంగాపార్వతిసమేత భీమేశ్వర స్వామి, బొడ్రాయి, గ్రామదేవతల విగ్రహాలను ప్రతిష్ఠించారు. శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సం నిర్వహించారు. అనంతరం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు స్వామి వార్లను దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి స్వామి వార్ల తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు 25వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సత్తెనపల్లి కి చెందిన పూర్ణనేత్ర, దంత వైద్యశాల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నూతన ఆలయ, జీవ ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటిరాంబాబు పాల్గొని స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కౌలు రైతు బలవన్మరణం



గురజాల ప్రసాద్ మృతదేహం

సత్తెనపల్లి: కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గోరంట్ల గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన గురజాల ప్రసాద్ (42) పొలంలోని తిరుపతమ్మ తల్లి గుడి వద్ద గల నేల బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఏటా 4–5 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని మిర్చి, పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో కొంత అప్పులయ్యాయి. అప్పులు తీరే మార్గం కనిపించక నిత్యం బాధపడుతున్నాడు. ఈ క్రమంలో పురుగు మందు సేవించి బలవన్మరణానికి పాల్పడేందుకు శనివారం యత్నించగా కుటుంబ సభ్యులు అడ్డుకోవడంతో ఆగిపోయాడు. ఆదివారం నేల బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడినట్లు మృతుని తండ్రి నరిసింహారావు చెప్పాడు. సుమారు రూ. 7 నుంచి 10 లక్షల వరకు అప్పలు ఉన్నాయని ఆయన తెలిపాడు. మృతునికి భార్య ధనలక్ష్మీమ, కుమారుడు శ్రీనివాసరావు, కుమార్తె శ్రీలక్ష్మీ ఉన్నారు. భర్త బలవన్మరణానికి పాల్పడడంతో భార్య ధనలక్ష్మీ, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలోని నేలబావిలో పడి ఉన్న ప్రసాద్ మృదేహాన్ని గ్రామస్తులు కలిసి వెలికి తీశారు. దీనిపై సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకు న్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): ద్విచక్రవాహనం ఆటోను ఢీకొన్న ప్రమాదంలో యువకుడికి గాయాలైన ఘటన మండలంలోని గోళ్లపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. మండలంలోని తురకపాలెం గ్రామానికి చెందిన గుంటూరు హరీష్‌బాబు ద్విచక్రవాహనంపై తురకపాలెం నుంచి నరసరావుపేట బయలుదేరాడు. మార్గమధ్యలో గోళ్ళపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరీష్ కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నకరికల్లు జెడ్పీ పాఠశాలలో చదివిన విద్యార్థులు

రాజుపాలెం(నకరికల్లు): నకరికల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థులు సమ్మోళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనం స్థానిక లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో నిర్వహించారు. 1980–1985 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులు 38 ఏళ్ల తరువాత కలుసుకోఒవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఒకరినొకరు గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో పరిచయాలు చేసుకున్నారు. అదే ఏడాదుల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివిన విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో కలసి సమ్మేళనంలో పాల్గొన్నారు. ఒక్కసారిగా అందరు కలువడం పట్ల ఆనందం వ్యక్తపరుచుకున్నారు. ఉన్నత స్థాయికి ఎదిగినప్పటికి చిన్ననాటి స్నేహితులతో కలిశిమెటసి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకన్నారు. స్థాయిలు మరిచి అరే...ఒరే.. అని పిలుచుకున్నారు. స్నేహానికి ఏఅంతస్తులు, హోదాలు అడ్డురావని అవధులు లేని ఆనందాన్ని వెల్లబుచ్చుకున్నారు. అనంతరం వారికి చదువుచెప్పిన ఉపాధ్యాయులను ఆప్యాయంగా పలుకరించి పాదాభివందనాలు చేసి ఘనంగా సత్కరించి వారి ఆసిస్సులు పొంది తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పర్యావరణ ప్రాముఖ్యతపై అవగాహన

పిడుగురాళ్ల: పర్యావరణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ రెంజ్ ఆఫీసర్ వీరేశలింగం నాయుడు అన్నారు. పట్టణంలోని స్కాలర్ కాలేజీలో విద్యార్థులకు పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందనంను పొదుపు చేయాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని తెలియజేశారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల వాడకం తగ్గించుకోవడం వల్ల పర్యావరణాన్ని పరీక్షించుకోవచ్చునన్నారు. అదేవిధంగా సుస్థిరమైన ఆహార పద్ధతులను అలవర్చుకోండి, వ్యర్థాలను తగ్గించుకోవడం మంచిదని తెలియజేశారు.

గురజాల డీఎస్పీ విస్తృత పర్యటన

దుర్గి: ఇటీవల గురజాల సబ్ డివిజన్‌కు నూతనంగా నియమితులైన డీఎస్పీ పల్లపురాజు ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. స్థానిక ఎస్ఐ కె సతీష్‌ను వెంటబెట్టుకుని మండల పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. శాంతిభద్రతల చర్యలో భాగంగా పలు గ్రామాలరూట్ మ్యాప్‌ను తెలుసుకున్నారు.